# క్రైమ్ కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దినపత్రిక

సంపుటి : 03 సంచిక : 97 బుధవారం 07-01-2026 పేజీలు : 4 వెల : 4/-

Website:- https://www.crimecounter.in/



క్రైమ్ కౌంటర్ News
ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలంగాణ సూర్యాపేట జిల్లా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

రిపోర్టర్లు కావలెను

- జిల్లా బ్యూరోలు
- నియోజక వర్గ ఇన్చార్జీలు

Contact No: 98497 07349


## క్రైమ్ కౌంటర్ జాతీయ తెలుగు దినపత్రిక

# డైరీ ఆవిష్కరణ...



నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా క్రైమ్ కౌంటర్ జాతీయ తెలుగు దినపత్రిక డైరీ ఆవిష్కరణ...

బాదావత్ సంతోష్ ఐపిఎస్

క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి నాగర్ కర్నూల్ జిల్లా:- మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో క్రైమ్ కౌంటర్ జాతీయ తెలుగు దినపత్రిక డైరీ ఆవిష్కరణ కలెక్టర్ బాడవత్ సంతోష్ అయితే చేతుల మీదుగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ముందుగా క్రైమ్ కౌంటర్ జాతీయ తెలుగు దినపత్రిక. అధికారులకు నాయకులకు ప్రజలకు వారధిగా ఉంటూ నిరంతరం విజయాలను నిర్భయంగా వెలుగులోనికి తెస్తుంది దినపత్రిక పత్రికా పాత్ర అనేది ప్రస్తుతం ఉన్న సమాజంలో వెలుగు నీడ వంటి ది నిజాలు నిర్భయంగా రాస్తూ ప్రకటిస్తూ క్రైమ్ కౌంటర్ దినపత్రిక పనిచేస్తుందని అలాగే జిల్లా వ్యాప్తంగా ఎలాంటి సమస్యలను మా దృష్టికి తీసుకురావాలి అని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాడవత్ సంతోష్ తెలిపారు అలాగే ప్రతి ఒక్కరికి జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర క్రైమ్ కౌంటర్ దినపత్రిక ఇన్చార్జి శేఖర్ పాల్గొన్నారు.

# చైనా మంజాపై సంపూర్ణ నిషేధం



- చైనా మంజాపై సంపూర్ణ నిషేధం ఉ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- ప్రజల భద్రతే లక్ష్యం, సంక్రాంతి నేపథ్యంలో ప్రత్యేక తనిఖీలు

క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి మహబూబ్ నగర్ జిల్లా: - మహబూబ్ నగర్ జిల్లా పరిధిలో చైనా మంజా (నైలాన్/సింథటిక్ దారాలు) ను పూర్తిగా నిషేధించినట్లు జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిషేధాన్ని ఉల్లంఘిస్తూ చైనా మంజాను విక్రయించినా, వినియోగించినా లేదా దాని వల్ల ఎవరికైనా ప్రమాదం సంభవించినట్లయితే సంబంధిత వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రాబోయే సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని, జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక తనిఖీలు, నిఘా చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. నైలాన్, సింథటిక్ దారాలతో తయారయ్యే చైనా మంజా పర్యావరణానికి తీవ్ర హాని కలిగించడమే కాకుండా, ప్రజలు, వాహనదారులు, పక్షులకు ప్రాణాపాయం కలిగించే ప్రమాదం ఉన్నట్లు పేర్కొన్నారు.గతంలో చైనా మంజాతో గాలిపటాలు ఎగురవేసే సమయంలో అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, కొన్నిసార్లు గాలిపటాలు ఎగురవేసే వ్యక్తులు కూడా తీవ్రంగా గాయపడిన ఘటనలు నమోదయ్యాయని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ ప్రమాదాల నివారణ కోసమే చైనా మంజాపై సంపూర్ణ నిషేధం విధించబడిందని వివరించారు.చైనా మంజా విక్రయాలు లేదా వినియోగం చేసిన వారిపై పర్యావరణ పరిరక్షణ చట్టంఉ1986 ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలో ఎక్కడా చైనా మంజా విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రజలు చైనా మంజాను పూర్తిగా దూరంగా ఉంచి, సాధారణ దారాలతో మాత్రమే గాలిపటాలు ఎగురవేయాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. గాలిపటాలు ఎగురవేసే సమయంలో తప్పనిసరిగా కరెంట్ స్థంభాలకు దూరంగా, మైదానాలు వంటి సురక్షితమైన ప్రదేశాల్లోనే ఎగురవేయాలని సూచించారు. అలాగే బిల్డింగులపై నుంచి గాలిపటాలు ఎగురవేసే వారు తగిన భద్రతా చర్యలు పాటించి అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు.ఎవరైనా చైనా మంజా విక్రయాలు లేదా వినియోగం గమనించినట్లయితే వెంటనే డయల్ఉ100 కు లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712659360 కి సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ ప్రజలను కోరారు.

# సైబర్ వారియర్స్ కు ప్రశంసా పత్రాలు.

- డీజీపీ చేతుల మీదుగా నగదుబహుమతులు, ప్రశంసా పత్రాలు అందుకున్న సూర్యాపేట జిల్లా సైబర్ వారియర్స్.సైబర్ వారియర్స్ ను అభినందించిన ఎస్పి నరసింహ ఐపిఎస్
- సైబర్ నేరాల నియంత్రణలో ప్రతిభ చూపిన సూర్యాపేట జిల్లా పోలీస్ సైబర్ వారియర్స్.



క్రైమ్ కౌంటర్ న్యూస్ సూర్యాపేట జనవరి 06సైబర్ మోసానికి గురైన నగదును తిరిగి బాధితుల ఖాతాలో జమ చేయడంలో, కేసులను త్వరగా చేదించడం, సైబర్ నేరాల నియంత్రణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో ప్రతిభ చూపి బాగా పనిచేసిన సూర్యాపేట పట్టణ పి ఎస్ సైబర్ వారియర్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కోదాడ పట్టణ పి ఎస్ సైబర్ వారియర్ కానిస్టేబుల్ శివకుమార్, సూర్యాపేట రూరల్ పి ఎస్ సైబర్ వారియర్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు లకు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం రోజున జిల్లా పోలీసు కార్యాలయం నందు ఎస్పి నరసింహ ఐపిఎస్ గారిని మర్యాదపూర్వకంగా కలిసినారు. ఎస్పి సిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలిపినారు. రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ నందు ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ఐపీఎస్, సైబర్ సెక్యూరిటీ అడిషనల్ డీజీ శిఖా గోయల్ ఐపిఎస్ గార్ల చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందించారు. సూర్యాపేట జిల్లా సైబర్ సెక్యూరిటీ సెల్ ఆధ్వర్యంలో ప్రతి పోలీస్ స్టేషన్ నందు సైబర్ వారియర్స్ పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలు అందుకున్న జిల్లా సైబర్ వారియర్ కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ నరసింహ అభినందించి, భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. సైబర్ నేరాల నియంత్రణలో సూర్యాపేట జిల్లా పోలీసుల కృషి రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందడం పట్ల జిల్లా పోలీసు విభాగం హర్షం వ్యక్తం చేసింది.ఈ కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ సెల్ సిబ్బంది ఉన్నారు.

# అన్నదాన కార్యక్రమం.



చిలుకూరు కాలువొడ్డు

శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో అభిషేకాలు, ఆకు పూజలు, అన్నదాన కార్యక్రమం.

క్రైం కౌంటర్ న్యూస్ కోదాడ, చిలుకూరు. జనవరి 06 (గురునాథం జిల్లా ప్రతినిధి.) సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం చిలుకూరు మండలం చిలుకూరు గ్రామంలో కొన్ని శతాబ్దాలుగా కొలువై ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో ది.06-01-2026 నూతన ఆంగ్ల సంవత్సరం లో జనవరి నెల 1 వ మంగళవారం సందర్భంగా చిలుకూరు శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దివ్య దర్శనం చేసుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ “శ్రీ రామ“ “జయ రామ“ “జయజయ రామ“ అంటూ స్మరిస్తూ మొక్కలు తీర్చుకుంటూ, స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, ఆకు పూజలు చేశారు. ఆలయం అర్చకులు భక్తులు చేత ప్రత్యేకంగా శ్రీ సుబ్రహ్మణ్య స్వామి, ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు ఆకు పూజలు నిర్వహించారు. తదనంతరం అన్నదానం ఆలయం కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కొంతమంది భక్తులు ఆర్థిక సహాయం చేసారు. భక్తులకు ఆలయం కమిటీ చైర్మన్ కొడారు వెంకటేశ్వర్లు మరియు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇట్టి అన్నదానం కార్యక్రమంలో ఆలయం చైర్మన్ శ్రీ కొడారు వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ మాదారపు లక్ష్మయ్య, మరియు కమిటీ సభ్యులు కట్టెకోల చంద్రయ్య, చలమయ్య గారి శ్రీను, బొబ్బా సమ్మిరెడ్డి, గోపయ్య, వీరభద్రం, రోజా భవానీ, లక్ష్మీ, లావణ్య మంగమ్మ, పద్మ, తదితరులు పాల్గొన్నారు. తదుపరి ఆలయం సంప్రదాయం ప్రకారం అన్నదానం చేయించిన, అందుకు సహకరించిన భక్తులకు స్వామి వారి దివ్య ఆశీస్సులతో ఆశీర్వాదం అందజేశారు. మరియు ఆలయం కమిటీ చైర్మన్ శ్రీ కొడారు వెంకటేశ్వర్లు, గత వారం వారి తల్లి పున్నమ్మ ఆలయానికి ఒక టెంట్ ( 12ఐ36) మరియు 11 కుర్చీలు, అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆలయం చైర్మన్, కమిటీ సభ్యులు, గ్రామస్తులు, కోదాడ, హుజూర్ నగర్, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దివ్య దర్శనం చేసుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దివ్య దర్శనం చేసుకుని అన్న ప్రసాదం స్వీకరించారు.

# వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ సర్వీసెస్ గా జూలూరు రమేష్ బాబు బాధ్యత స్వీకరన...



క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి హైదరాబాద్: - వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రెటరీ సర్వీసెస్ గా జూలూరు రమేష్ బాబు బాధ్యతలు స్వీకరించారు. క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు సిద్ధ వెంకట సూర్య ప్రకాష్ రావు నుండి నియామక పత్రం అందుకొని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జూలూరు రమేష్ బాబు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో కొనసాగుతున్న వాసవి క్లబ్ సేవలను బలోపేతం చేసి మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజంలోని అన్ని వర్గాలకు సేవలు అందించే విధంగా ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతామన్నారు. వివిధ దేశాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలలో సేవలు కొనసాగుతున్నవి అని చెప్పారు. ఎన్నో అవార్డులు సాధించి సేవలకు వన్నెతెచ్చిన ఘనత వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ది అని ఆయన అన్నారు. సైనికుల సంక్షేమం నిధి కోసం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో గవర్నర్ జిష్ణుదేవ్ శర్మకు రూ.25 లక్షల చెక్కు అందించామన్నారు.ఈ సంవత్సరం నూతన అధ్యక్షుని ఆధ్వర్యంలో విభిన్న కార్యక్రమాలు చేపట్టి సామాజిక సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లి మరిన్ని అవార్డులు సాధించే దిశగా ప్రణాళిక ప్రకారం పని చేస్తామని జూలూరు రమేష్ బాబు, రాజేశ్వరి దంపతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా రమేష్ బాబు దంపతులను పలువురు ఘనంగా సత్కరించారు.

# రోడ్డు భద్రతా పాటించాలి.

జూనియర్ సివిల్ జడ్జ్ భవ్య




.క్రైం కౌంటర్ న్యూస్ కోదాడ, జనవరి 06 ( గురునాథం జిల్లా ప్రతినిధి.) మంగళవారం కోదాడ పట్టణంలోని బిల్లింగ్ గ్రామర్ హైస్కూల్లో జరిగిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమానికి జూనియర్ సివిల్ జడ్జి భవ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశలో చదువుపై దృష్టి పెట్టాలని ఇతర వాహనాలను చూడాలని ఆలోచన చేయవద్దని పొరపాటున డ్రైవింగ్ చేసి ప్రమాదానికి గురైతే కుటుంబానికి దూరమవుతారని ఉపాధ్యాయులు విద్యార్థులకు రోడ్ సేఫ్టీ పై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఉయ్యాల నరసయ్య, పాఠశాల ప్రిన్సిపల్ బెజ్జంకి జగన్ మోహన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పిఎస్ఎన్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి దివ్య సంకల్ప పాదయాత్ర.



క్రైం కౌంటర్ న్యూస్ కోదాడ, జనవరి 06 ( గురునాథం జిల్లా ప్రతినిధి.) సంకల్పంతో సాగే ప్రతి యాత్ర శుభ సూచకంతమ్మరబండపాలెం బండపై వెలిసిన సుమారు 1000 సంవత్సరాల క్రితం స్వయంభూగా వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్య రూపాన్ని దర్శించడం మన అదృష్టం. జనవరి 10, 2026 (శనివారం ఉదయం 8:00 గంటలకు కోదండ రామాలయం కోదాడ నుండి స్వయంభూ శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధి, తమ్మరబండ పాలెం సుమారు 5 కిలోమీటర్లు మార్గమధ్యంలో తమ్మర రామాలయంలో సీతారాముల ఆశీస్సులు తీసుకొని భజన కీర్తనలు, కోలాట నృత్యాలతో ఆధ్యాత్మిక సందడితో పురుషులు ఉ సంప్రదాయ తెల్లని వస్త్రాలు మహిళలు ఉ పసుపు రంగు వస్త్రాలు స్వామివారి దర్శనానంతరం తీర్థప్రసాద వితరణ. భక్తికి సంకల్పం తోడైతే,ఈ ప్రపంచంలో ఏ సాధనకైనా దారి చూపేమనోధైర్యాన్ని ప్రసాదించే మహాయాత్ర ఇది. ఈ పవిత్ర పాదయాత్రలో మీరు కుటుంబ సమేతంగా పాల్గొని ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తున్నాము. మనమందరం కలిసి నడుద్దాం శ్రీవారి దివ్య ఆశీస్సులు పొందుదామని రామిశెట్టి కృష్ణవేణి తెలిపారు. పూర్తి వివరములకు 9948029497 ను సంప్రదించండి.

# ప్రవచనాలు విని అభినందనలు తెలిపిన వంశికృష్ణమాచార్యులు.



క్రైం కౌంటర్ న్యూస్ కోదాడ, జనవరి 06 ( గురునాథం జిల్లా ప్రతినిధి.) రంగనిగుడి లో జరుగుతున్న ధనుర్మాసోత్సవ పూర్వక ప్రవచనాలను గూర్చి తిరుమల తిరుపతి దేవస్థానములు వారి ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ వారు పరిశీలించడం జరిగింది. పరిశీలకులు శ్రీమాన్ భాగవతుల వంశీకృష్ణమాచార్యులు ఉదయం7గంటలకే విచ్చేసి తిరుప్పావై సేవా కాలంలో పాల్గొని, అనంతరం శ్రీమాన్ ముడుంబైలక్ష్మణాచార్యలు చెప్పిన ప్రవచనంను విని ఆనందించి ప్రశంసించారు. ఈ నెలరోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో విశేషం సంఖ్యలో భక్తులు, ఆలయార్చకులు, ఈవో, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు చదువుతో పాటు శారీరక దృఢత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలి.





సర్పంచ్ బల్గూరి స్నేహ దుర్గయ్య.

క్రైం కౌంటర్ న్యూస్ కోదాడ, గణపవరం. జనవరి 06 ( గురునాథం జిల్లా ప్రతినిధి. )విద్యార్థులకు చదువుతో పాటు శారీరక దృఢత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలని సర్పంచ్ బల్గూరి స్నేహ దుర్గయ్య అన్నారు. మండల పరిధిలోని గణపవరం గ్రామంలో మంగళవారం ప్రభుత్వ పాఠశాలను గ్రామ సర్పంచ్ బల్గూరి స్నేహ దుర్గయ్య సందర్శించారు.పాఠశాలలోప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్య,పాఠశాల నిర్వహణ విధానం,బోధన స్థాయిడిజిటల్ బోర్డుల సంఖ్య, వాటి ఉపయోగం వాటి పనితీరు ఇంకా ఏ వసతులు అవసరమోఅన్నివిషయాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, పిల్లల చదువుతో పాటు శారీరక దృఢత్వానికి ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థులకు ఫుట్‌బాల్‌లు అందజేయడం జరిగింది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలు మరింత మెరుగు పడేలా ప్రతి ఒక్కరు పాటు పడాలని ఉపాధ్యాయులను, తల్లి తండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి జీవిత, ఇర్లా శ్రీనివాసరెడ్డి, కొండ ధనమూర్తి, శ్యామకురి, గురవయ్య, నాగ స్వరూప్, విద్యార్థిని విద్యార్థులు గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఇరుముడి మహోత్సవం కార్యక్రమం.



ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న ఎర్నేని వెంకటరత్నం బాబు.

క్రైం కౌంటర్ న్యూస్ కోదాడ, శ్రీరంగాపురం. జనవరి 06 ( గురునాథం జిల్లా ప్రతినిధి. ) సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం కోదాడ మున్సిపల్ పరిధిలో గల శ్రీరంగపురం అభయాంజనేయ స్వామి దేవాలయంలో కమిటీ సభ్యుడు కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్నేని వెంకటరత్నం బాబు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇరుముడిని స్వామివారికి సమర్పించి భక్తులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ కుర్రి గోపయ్య, గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మల్లు వెంకటరెడ్డి( జెసిబి,) జై హనుమాన్ ఇండస్ట్రీస్ అధినేత బొలిశెట్టి రాము, దేవాలయ వైస్ చైర్మన్ చిత్తలూరు వెంకటేశ్వర్లు, మల్లు నాగిరెడ్డి, మల్లు రోహిత్ రెడ్డి, సిరంశెట్టి వెంకటేశ్వర్లు, మల్లెబోయిన శ్రీనివాస్, బోడ శివ లింగయ్య, అవిరే వెంకటేశ్వర్లు, శంకర్ మేస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి గ్రామ అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం



క్రైమ్ కౌంటర్ న్యూస్ ప్రతినిధి హైదరాబాద్ జిల్లా: – కాయితి ఆశాదీప్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యకుడిగా ఎన్నికైన సందర్భంగా నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి ఆశాదీప్ రెడ్డి ని తన నివాసానికి స్వయంగా ఆహ్వానించారు,ఎంపీ మల్లు రవి ఆహ్వానం మేరకు మంగళవారం రోజు హైదరాబాద్ లోని తన నివాసంలో ఆశాదీప్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు,ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆశాదీప్ రెడ్డి కి బోకే తో ఘనంగా అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ ఈ విజయం ఆశాదీప్ రెడ్డి కష్టానికి నిదర్శనమని, రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ ఇదే ఉత్సాహంతో పార్టీ క్లీన్ స్వీప్ చేయాలని వారు పిలుపునిచ్చారు,ఆశాదీప్ రెడ్డి రాష్ట్ర అధ్యక్షుడి పదవి కైవసం చేసుకోవడం నియోజకవర్గ పార్టీ శ్రేణుల్లో కొత్త నూతనోత్తేజాన్ని నింపిందని హర్షం వ్యక్తం చేశారు,నూతనంగా ఎన్నికైన సర్పంచులు పాత పద్ధతులకు స్వస్తి చెప్పి, కొత్త ప్రణాళికలతో గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాయితి సాయి రెడ్డి టిపిసిసి కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్,వెల్దండ మండల అధ్యక్షులు మోతిలాల్ నాయక్, అమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట నర్సింహా, వివిధ గ్రామాల నూతన సర్పంచులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయంలో ఆకు పూజలు,అభిషేకాలు



శ్రీ కాల్వ ఒడ్డు అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఆకు పూజలు,అభిషేకాలు

క్రైమ్ కౌంటర్ న్యూస్ చిలుకూరు జనవరి 6 చిలుకూరు మండల రిపోర్టర్ సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గ చిలుకూరు మండల కేంద్రంలోని చిలుకూరు శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దివ్య దర్శనం చేసుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ శ్రీ రామ జయ రామ జయజయ రామ అంటూ స్మరిస్తూ మొక్కలు తీర్చుకుంటూ , స్వామి వారి కి ప్రత్యేక అభిషేకాలు ఆకు పూజలు చేస్తారు. ఆలయం అర్చకులు ఈరోజు భక్తులు చేత ప్రత్యేకంగా శ్రీ సుబ్రహ్మణ్య స్వామి, ఆంజనేయ స్వామి వారి కి ప్రత్యేక అభిషేకాలు ఆకు పూజలు నిర్వహించారు. తదనంతరం అన్నదానం ఆలయం కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో, ఏర్పాటు చేశారు. కొంతమంది భక్తులు ఆర్థిక సహాయం చేసారు.భక్తులు కు ఆలయం కమిటీ సభ్యులు నిర్వహణలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఇట్టి అన్నదానం కార్యక్రమం లో ఆలయం ఛైర్మన్ శ్రీ కొడారు వెంకటేశ్వర్లు, మాదారపు లక్ష్మయ్య, కట్టెకోల చంద్రయ్య, చలమయ్య గారి శ్రీను, బొబ్బా.సమ్మిరెడ్డి, గోపయ్య, వీరభద్రం, రోజా భవానీ, లక్ష్మీ లావణ్య మంగమ్మ పద్మ, తదితరులు పాల్గొన్నారు... తదుపరి ఆలయం సంప్రదాయం ప్రకారం అన్నదానం చేయించిన భక్తులకు సన్మానం చేయించారు. ఇట్టి కార్యక్రమం లో ఆలయం ఛైర్మన్ కమిటీ సభ్యులు , గ్రామస్తులు, కోదాడ, హుజూర్ నగర్, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దివ్య దర్శనం చేసుకుని అన్న ప్రసాదం స్వీకరించారు.



# భీమా రంగంలో 100% ఎఫ్‌డీఐ దేశానికే ప్రమాదం....



భీమా రంగంపై విదేశీ గుత్తాధిపత్యమా? ఎస్.ఎస్. శ్రీనివాసరావు ధ్వజం.

క్రైం కౌంటర్ న్యూస్ కోదాడ, జనవరి 06 ( గురునాథం జిల్లా ప్రతినిధి. )దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న భీమా రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతి ఇవ్వడం అత్యంత విచారకరమని ఆల్ ఇన్సూరెన్స్ అసోసియేషన్ నాయకులు ఎస్.ఎస్. శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం కోదాడలో ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఈ నిర్ణయం వల్ల దేశీయ పొదుపు నిధులు విదేశీ కంపెనీల పరమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, విదేశీ కార్పొరేట్ శక్తులకు రెడ్ కార్పెట్ వేయడం వల్ల దేశ భద్రతకు, సామాన్యుల పాలసీల భద్రతకు ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు.సామాన్య ప్రజల నమ్మకానికి చిహ్నమైన భీమా రంగాన్ని లాభాపేక్ష కలిగిన విదేశీ సంస్థలకు అప్పగించడం వల్ల పాలసీదారుల ప్రయోజనాలు దెబ్బతింటాయని అన్నారు. ఈ నిర్ణయం పట్ల ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పునరలోచన చేసి వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# ఆ జిల్లా కేంద్రం దశ తిరిగింది..




తెలంగాణ అసెంబ్లీలో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. శాసనమండలిలో అందెశ్రీ కుమారుడికి ఉద్యోగం, ఎమ్మెల్సీ కవిత రాజీనామా వంటి ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ సమావేశాలు పలు ముఖ్యమైన బిల్లులకు ఆమోదం తెలిపాయి. తెలంగాణ శాసనసభ మంగళవారం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ, అభివృద్ధిలో భాగంగా జిల్లా కేంద్రమైన నల్లగొండను మున్సిపల్ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రవేశపెట్టిన బిల్లుకు అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో నల్లగొండ పట్టణ ముఖచిత్రం పూర్తిగా మారనుంది. నల్లగొండ పట్టణం శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సాధారణంగా ఒక పట్టణాన్ని కార్పొరేషన్‌గా గుర్తించడానికి రూ. 20 కోట్ల వార్షిక ఆదాయం, 2 లక్షల జనాభా ప్రాతిపదికగా ఉంటుంది.

# జాతీయ స్థాయిలో తెలంగాణ ప్రతిష్ఠను చాటిన ఎన్ఎస్ఎస్ వాలంటర్ డోంగ్రీ నిరోష



గ్రామీణ నేపథ్యం నుంచి జాతీయ వేదిక వరకు స్ఫూర్తిదాయక ప్రయాణం

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా (క్రైం కౌంటర్ ) జనవరి 6

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలోని డోంగ్రీ హోక్టు పంచశీల దంపతుల కుమార్తె, తెలంగాణ యూనివర్సిటీ దక్షిణ ప్రాంగణం ఎన్ఎస్ఎస్ యూనిట్‌ఉ5 వాలంటర్, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ రెండో సంవత్సరం విద్యార్థినీ డోంగ్రీ నిరోష, జాతీయ స్థాయి వేదికపై తన ప్రతిభను చాటుతూ జిల్లాకు, రాష్ట్రానికి గర్వకారణం అయ్యారు.22 డిసెంబర్ 2025 నుండి 28 డిసెంబర్ 2025 వరకు, హైదరాబాద్ సమీపంలోని దుండిగల్ ప్రాంతంలో నిర్వహించిన జాతీయ ఏకీకరణ శిబిరంలో డోంగ్రీ నిరోష చురుకుగా పాల్గొని, సేవా భావం, సాంస్కృతిక అవగాహన, జాతీయ ఐక్యతను ప్రతిబింబించేలా ప్రతిభ చూపారు. ఈ శిబిరం విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, సమన్వయం, జాతీయ ఐక్యతను పెంపొందించడానికి ఏర్పాటు చేయబడింది.

దేశ నలుమూలల నుంచి వాలంటీలు ఐక్యతకు బలమైన సందేశం

ఈ శిబిరానికి దేశంలోని 11 రాష్ట్రాల వాలంటర్లు హాజరయ్యారు. వేర్వేరు భాషలు, వేర్వేరు సంస్కృతులు ఉన్నప్పటికీ, ప్రతీ విద్యార్థి ఒకే జాతీయ భావనతో, ఐక్యత కదలికతో పాల్గొన్నారు. ప్రతి రోజు నిర్వహించిన కార్యక్రమాలు సేవ, సమాజపట్ల బాధ్యత, జాతీయతను బలపరిచేలా రూపొందించబడ్డాయి.డోంగ్రీ నిరోష ప్రతి కార్యక్రమంలో చురుకుగా, క్రమపద్ధతిగా పాల్గొని తన కృషి, సమయపట్టుదల, సహకార భావంతో ఇతర వాలంటీలకు స్ఫూర్తిగా నిలిచారు. ప్రతిరోజూ కొత్త సవాలు, కొత్త అవగాహన, నూతన అనుభవం ప్రతి ఒక్కరికి ప్రేరణగా నిలిచింది.

తెలంగాణ సంస్కృతికి జాతీయ వేదికపై ఘన ప్రతినిధ్యం

డోంగ్రీ నిరోష, తెలంగాణ రాష్ట్ర విద్యార్థులతో కలిసి తమ రాష్ట్ర సంప్రదాయాలను జాతీయ వేదికపై అద్భుతంగా ప్రదర్శించారు. డప్పు దరువు, బతుకమ్మ, బోనాలు వంటి నృత్యాలు, పండుగల ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. అలాగే స్వదేశీ క్రీడలు, దేశీయ నాటక ప్రదర్శనలు కూడా జాతీయతను ప్రతిబింబించాయి. ఆమె చురుకైన, సమన్వయపూర్ణమైన, సేవా భావపూరిత ప్రతిభ జాతీయ వేదికపై ప్రత్యేక గుర్తింపును తెచ్చింది. తెలంగాణ సాంస్కృతిక సంపదను దేశానికి మాత్రమే కాక, ఇతర రాష్ట్రాల విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించడం జరిగింది.

ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలు

ప్రతిరోజూ నిర్వహించిన కార్యక్రమాలలో రాష్ట్రాల సాంప్రదాయ నాటకాలు,జాతీయ ఐక్యతను ప్రతిబింబించే సాంస్కృతిక ప్రదర్శనలు, సమాజపట్ల బాధ్యత, సహకారం, సమన్వయం పెంపొందించే ఆటలు,గ్రామీణ సంస్కృతి, వనజీవి, పర్యావరణంపై అవగాహన,సామూహిక క్రీడలు, ప్రతిభా ప్రదర్శనలు,ప్రతీ రోజు విద్యార్థులు జాతీయతను, సేవా భావాన్ని, సామాజిక బాధ్యతను మరింతగా అవగాహన చేసుకున్నారు. డోంగ్రీ నిరోష ప్రతి కార్యక్రమంలో తన సామర్థ్యాన్ని, చురుకుదనాన్ని, సహకార భావాన్ని చూపుతూ ప్రతీ ఒక్కరి కోసం ప్రేరణగా నిలిచారు.




తెలంగాణ యూనివర్సిటీ అధ్యాపకుల ఘన అభినందనలు

డోంగ్రీ నిరోష జాతీయ వేదికపై ప్రతిభ చూపిన సందర్భంలో తెలంగాణ యూనివర్సిటీ దక్షిణ ప్రాంగణంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ అంజయ్య అధ్యాపక బృందం విద్యార్థినీ ఘనంగా అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ డోంగ్రీ నిరోష లాంటి యువత నాయకత్వ లక్షణాలతో, సేవా భావంతో, చురుకైన ప్రయత్నంతో జాతీయ స్థాయిలో తెలంగాణను ప్రతినిధ్యం వహించడం గర్వకారణం. యువత చదువులో మాత్రమే కాక, సమాజపట్ల బాధ్యతను, సేవా మనోభావాన్ని పెంపొందించుకోవాలి. ఇలాంటి వాలంటర్ లు క్రమశిక్షణ, కృషి, సమాజ సేవలో యువతకు స్ఫూర్తిగా నిలుస్తారు. జాతీయ ఐక్యత, ప్రాంతీయ సాంస్కృతిక సంపదను జాగ్రత్తగా ప్రదర్శించడం, ఇతర రాష్ట్రాల విద్యార్థులకు అనుసరణీయమని, వారిలో దేశభక్తిని, సేవా భావాన్ని రేకెత్తిస్తుందనీ పేర్కొన్నారు.

ఎన్ఐసీ అనుభవం సేవ, స్ఫూర్తి, ఐక్యత

డోంగ్రీ నిరోష ఎన్ఐసీలో పొందిన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ దేశంలోని 11 రాష్ట్రాల వాలంటీలతో కలిసి పనిచేయడం, ప్రతి రోజు సవాళ్లను ఎదుర్కోవడం నా జీవితానికి గొప్ప అనుభవం. ప్రతిరోజూ నిర్వహించిన కార్యక్రమాలు జాతీయతను, సేవా భావాన్ని, సమాజపట్ల బాధ్యతను బలపరిచాయి.తెలంగాణ సంప్రదాయాలను, నాటకాలు, క్రీడలు, ఉత్సవాలను జాతీయ వేదికపై ప్రదర్శించడం నా కోసం మాత్రమే కాక, ఇతర రాష్ట్రాల విద్యార్థుల కోసం ప్రేరణ. ఇలాంటి అవకాశాలు యువతకు జీవితాంతం గుర్తుండే స్ఫూర్తిని ఇస్తాయి. ప్రతి పని, ప్రతి కృషి, ప్రతి సమయనివ్వడంలో సేవా భావం, చురుకుదనం, ఐక్యత ఉండాలి. యుక్త వయస్సులోనే నేర్చుకున్న విలువలు, సంప్రదాయాలను భవిష్యత్తులో దేశాభివృద్ధికి ఉపయోగించుకోవాలనీ డోంగ్రీ నిరోష తెలిపారు.డోంగ్రీ నిరోష సేవా మానసికత, చురుకుదనం, కృషి, సమాజపట్ల బాధ్యత, జాతీయ ఐక్యతలో ప్రతిభ చూపి, యువతకు ప్రేరణగా నిలిచారు. ప్రతి కార్యకలాపంలో చూపిన బాధ్యత, ప్రతిభ, ఐక్యత ఆమె వ్యక్తిత్వం విశిష్టతను మరోసారి నిరూపించాయి.



# ఆ దేశాల ప్లేయర్లకు ఇండియన్ వీసా రావట్లేదు!



ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026కు భారత్, శ్రీలంక ఆతిథ్యం ఇస్తున్న విషయం తెలిసిందే. అయితే, పాకిస్తాన్ పాస్‌పోర్టులు లేదా పాకిస్తాన్ మూలాలున్న.. వివిధ దేశాలకు చెందిన ఆటగాళ్లకు భారత వీసాలు లభించడంలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో యూఎస్ఏ, ఒమన్, యూఏఈ, ఇటలీ, కెనడా వంటి దేశాలు ఇప్పటికే ఈ విషయాన్ని ఐసీసీ, బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లాయి. త్వరలో అన్ని దేశాలు కలిసి ఐసీసీకి లేఖ రాయనున్నట్లు తెలుస్తోంది. ఐసీసీ పురుషుల టీ20 వరల్డ్ కప్ 2026కు సమయం దగ్గరపడుతోంది. 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరగనున్న ఈ టోర్నీ ప్రారంభానికి సరిగ్గా నెల సమయం ఉంది. భారత్, శ్రీలంక సంయుక్త వేదికల్లో మ్యాచ్‌లు జరుగుతాయి. భారత్‌లోని ఐదు వేదికలు, శ్రీలంకలోని 3 వేదికల్లో ఈ మ్యాచ్‌లు నిర్వహించున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి కొత్త చిక్కు వచ్చి పడింది. వరల్డ్ కప్‌లో పాల్గొనే వివిధ దేశాలు ప్లేయర్లకు ఇండియన్ వీసాలు లభించడంలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ విషయాన్ని ఇప్పటికే ఆయా దేశాలు ఐసీసీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. యూఎస్ఏ, ఒమన్, యూఏఈ, ఇటలీ, కెనడా వంటి దేశాలకు చెందిన చాలా మంది ప్లేయర్లకు భారతీయ వీసా పొందడంలో సమస్యలు వస్తున్నాయి. ఈ ప్లేయర్లందరికీ పాకిస్తాన్ పాస్‌పోర్టులు లేదా పాకిస్తాన్ మూలాలు ఉన్నాయి. దీంతో వీసా రావడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఇప్పటికే ఆయా దేశాల క్రికెట్ బోర్డులు ఐసీసీతో పాటు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి కూడా లేఖలు రాసినట్లు సమాచారం. ఇక పాకిస్తాన్‌కు చెందిన ఓ మీడియా సంస్థ కథనం ప్రకారం.. ఈ వీసా సమస్య గురించి ఈ దేశాలన్నీ కలిసికట్టుగా ఐసీసీకి లేఖ రాయనున్నట్లు తెలుస్తోంది.ఎందుకిలా వీసా సమస్య వస్తోంది?ఈ మధ్య కాలంలో భారత్, పాకిస్తాన్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇక గతేడాది మార్చిలో పాకిస్తాన్ ఉసిగొల్పిన ఉగ్రవాదులు జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో 26 మంది పర్యాటకులను చంపి మారణహోమం సృష్టించారు. ఈ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా దౌత్యపరంగా పాకిస్తాన్‌తో కమ్యూనికేషన్ యాక్సెస్ కట్ చేసింది భారత్. దాని ప్రభావం వీసా సర్వీసులపై పడింది. అందుకే పాకిస్తాన్ పాస్‌పోర్టులు ఉన్న వారు, పాకిస్తాన్ మూలాలు ఉన్నవారికి.. భారతీయ వీసా రావడం కష్టతరమవుతోంది. దీంతో ఆయా దేశాల టీ20 వరల్డ్ కప్ జట్ల సభ్యులపై కూడా ప్రభావం పడింది.పాకిస్తాన్‌కు డోకాలేదు!కాగా, పాకిస్తాన్ ప్లేయర్లకు ఈ ఇబ్బంది లేదు. ఎందుకంటే భారత్-పాక్ మ్యాచ్‌లతో సహా పాకిస్తాన్ ఆడే మ్యాచ్‌లు అన్నీ హైబ్రిడ్ మోడల్‌లో శ్రీలంకలో షెడ్యూల్ చేశారు. దీంతో ఆ దేశ ప్లేయర్లకు ఇండియన్ వీసా అవసరం లేదు. కాగా, లీగ్ దశలో మరోసారి భారత్-పాక్ తలపడనున్నాయి. ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా ఈ మ్యాచ్

# చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ..



యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరో రికార్డు సృష్టించాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన యూత్ వన్డే సిరీస్‌లో మరో అరుదైన రికార్డు నెలకొల్పాడు. బెనోని వేదికగా జరిగిన రెండో మ్యాచ్‌లో కేవలం 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాది.. యూత్ వన్డే చరిత్రలో అత్యంత వేగంగా అర్ధ శతకం సాధించిన ఆటగాడిగా నిలిచాడు. ఈ క్రమంలో 2016లో టీమిండియా స్టార్ బ్యాటర్ రిషభ్ పంత్ నమోదు రికార్డును బద్దలు కొట్టాడు వైభవ్ సూర్యవంశీ. ఇటీవల విజయ్ హజారే ట్రోఫీ 2025-26లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. కేవలం 36 బంతుల్లోనే సెంచరీ బాది.. లిస్ట్-ఏ క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు 14 ఏళ్ల సూర్యవంశీ. తాజాగా 2026 సవంత్సరాన్ని అత్యద్భుతంగా ప్రారంభించాడు. మరో సరికొత్త రికార్డు సృష్టించాడు. దక్షిణాఫ్రికాతో మూడు యూత్ వన్డే సిరీస్‌లో భాగంగా బెనోని వేదికగా జరిగిన రెండో మ్యాచ్‌లో.. కేవలం 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాదాడు. దీంతో యూత్ వన్డే చరిత్రలో అత్యంత వేగంగా అర్ధ శకతం సాధించిన ప్లేయర్‌గా నిలిచాడు వైభవ్ సూర్యవంశీ. యూత్ వన్డేల్లో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ ఇప్పటి వరకు టీమిండియా స్టార్ బ్యాటర్ రిషభ్ పంత్ పేరు మీద ఉండేది. దాదాపు 8 ఏళ్లు ఈ రికార్డును ఎవరూ ఛేదించలేకపోయారు. పంత్ 2016 అండర్ 19 ప్రపంచ కప్‌లో ఢాకా వేదికగా నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో.. కేవలం 18 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. తాజాగా దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో సూర్యవంశీ అద్భుతమైన బ్యాటింగ్‌తో యూత్ వన్డేలో ఫాస్టెస్ట్ ఫిఫ్టీగా రిషబ్ పంత్ రికార్డును బద్దలు కొట్టాడు. మొత్తంగా 24 బంతుల్లో ఒక ఫోర్, 10 సిక్సులతో 68 పరుగులు చేసి ఔట్ అయ్యాడు. కాగా, కెప్టెన్ ఆయుశ్ మాత్రే మ్యాచ్‌కు దూరమైన నేపథ్యంలో వైభవ్ సూర్యవంశీ జట్టుకు సారథ్యం వహిస్తున్నాడు.దక్షిణాఫ్రికాతో జరిగిన మొదటి మ్యాచ్‌లో భారత్ విజయంలో వర్షం కీలక పాత్ర పోషించింది. రెండో వన్డేలోనూ అదే విధంగా జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా.. 49.3 ఓవర్లలో 245 పరుగులు చేసింది. అయితే వర్షణం కారణంగా.. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ద్వారా మ్యాచ్‌ను కుదించారు. 27 ఓవర్లలో 174 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్.. అద్భుత ప్రదర్శన చేసింది. ఓపెనర్లు ఆరోన్ జార్జ్, వైభవ్ సూర్యవంశీ నాలుగు ఓవర్లలోనే 50 పరుగుల భాగస్వామ్యనం నెలకొల్పారు. వైభవ్ సూర్యవంశీ 10 సిక్సులతో రెచ్చిపోయాడు.సూర్యవంశీ ఔట్ అయ్యే సమయానికి భారత్ 2 వికెట్ల నష్టానికి 10 ఓవర్లలోనే భారత్ 103 పరుగులు చేసింది. ఆ తర్వాత నెమ్మదిగా వేదాంత్ త్రివేది (31లి), అభిజ్ఞాన్ కుందు (48లి) ఇన్నింగ్స్ పూర్తి చేశారు. ఇక సౌతాఫ్రికా బౌలర్ మైకెల్ క్రిష్‌క్యాంప్ రెండు వికెట్లు పడగొట్టాడు. దీంతో టీమిండియా విజయం సాధించింది. ప్రస్తుతం 2-0 తేడాతో సిరీస్‌ను భారత్ కైవసం చేసుకుంది. అండర్ 19 వరల్డ్ కప్ ముందు ఈ సిరీస్ భారత్, దక్షిణాఫ్రికాకు సన్నాహకంగా ఉపయోగపడుతోంది.

# బీసీసీఐ ఆదాయం అస్సలు తగ్గదు!



బంగ్లాదేశ్ ఆటగాడు ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్ నుంచి తొలగించిన విషయం తెలిసిందే. దీంతో తమ టీ20 వరల్డ్ కప్ 2026 మ్యాచ్‌లను భారత్ నుంచి తరలించాలని బంగ్లాదేశ్ డిమాండ్ చేస్తోంది. అంతేకాకుండా ముస్తాఫిజుర్ రెహమాన్ తొలగింపుకు నిరసనగా బంగ్లాదేశ్.. ఐపీఎల్ ప్రసారాలపై నిషేధం విధించింది. అయితే, ఈ నిషేధం ఐపీఎల్‌పై ప్రభావం చూపదని నిపుణులు అంటున్నారు. వ్యూయర్‌షిప్‌లో కూడా తేడా ఉండదని.. బీసీసీఐ ఆదాయంపై పెద్దగా ప్రభావం చూపదని నిపుణులు అంచనా వేస్తున్నారు. బంగ్లాదేశ్ ప్లేయర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్ నుంచి తొలగించడంతో వివాదం తలెత్తింది. ఇందులో బంగ్లాదేశ్ ప్రభుత్వం జోక్యం చేసుకోవడంతో ఈ వివాదం మరింత ముదిరింది. ఇప్పటికే టీ20 వరల్డ్ కప్ 2026 కోసం తాము భారత్‌లో పర్యటించబోమని బంగ్లాదేశ్ చెబుతోంది. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని అంటోంది. అందుకోసం ఈ మెగా టోర్నీ షెడ్యూల్‌లో మార్పులు చేయాలని ఐసీసీకి ఇప్పిటికే విజ్ఞప్తి చేసింది. అంతేకాకుండా ముస్తాఫిజుర్ రెహమాన్‌ను తొలగించిన దానికి నిరసనగా.. తమ దేశంలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రసారాలపై కూడా నిషేధం విధించింది బంగ్లాదేశ్. దీంతో ఐపీఎల్ వ్యూయర్‌షిప్, బీసీసీఐ బిజినెస్‌పై ఏమైనా ప్రభావం పడుతుందా? అనే ప్రశ్న వ్యక్తమవుతోంది. కాగా, బంగ్లాదేశ్.. ఇండియన్ టీ20 లీగ్‌పై నిషేధం విధించడం వల్ల ఐపీఎల్‌కు ఏ నష్టం జరగదని నిపుణలు అంటున్నారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆదాయం కూడా తగ్గదని చెబుతున్నారు. “బంగ్లాదేశ్‌లో ఐపీఎల్ ప్రసారాలను నిషేధించడం వల్ల.. ఈ లీగ్‌పై పెద్దగా ప్రభావం పడదని నేను భావిస్తున్నాను. ఇది బీసీసీఐ ఆదాయంపై కూడా ప్రభావం చూపదు. అంతేకాకుండా బ్రాడ్‌కాస్టర్ చెల్లించే మొత్తంలో కూడా మార్పులు ఉండవు“ ఓ బిజినెస్ నిపుణుడు చెప్పాడు. కాగా, గత సీజన్లలో ఇద్దరు లేదా ముగ్గురు బంగ్లాదేశ్ ఆటగాళ్లు మాత్రమే ఐపీఎల్‌లో ఆడేవారని.. అందుకే బిజినెస్‌తో పాటు వ్యూయర్‌షిప్‌పై కూడా పెద్దగా ప్రభావం ఉండదని అన్నారు. ఇదే అభిప్రాయాన్ని టీఆర్ఏ రీసెర్చ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎన్ చంద్రమౌలి వ్యక్తం చేశారు. ఒకవేళ కొద్ది పాటి ఆదాయ నష్టం ఉన్నా.. కొత్త బ్రాండ్ల రాక వల్ల ఆ నష్టం భర్తీ చేయబడుతుంది. ఇక ఏటేటా ఐపీఎల్ (రెవెన్యూ) పెరుగుతూనే ఉంటుంది కాబట్టి.. ప్రస్తుత స్పాన్సర్లు, రాబోయే సీజన్లలో తమ ప్రకటనలను మరింత పెంచుకోవచ్చు“ అని చంద్రమౌలి అన్నారు. బీసీసీఐ ఆదాయానికి ఇప్పటికిప్పుడు వచ్చే నష్టం ఏం లేదు. ఎందుకంటే.. ఐపీఎల్ 2023-27 కాలానికి మీడియా హక్కులకు సంబంధించి రూ.48,390 కోట్లతో ఒప్పందం జరిగింది. ఇక ఈ డీల్ ప్రకారం.. బంగ్లాదేశ్‌లో ఐపీఎల్ బ్రాడ్‌కాస్టింగ్ హక్కులు దక్కించుకుంది టీ స్పోర్ట్స్ అనే సంస్థ. ఒకవేళ ఒప్పందంలో పొందుపరిచిన నిబంధనలు సడలింపు ఇస్తే తప్ప.. మ్యాచ్‌లు ప్రసారం కాకపోయినా, ఒప్పందానికి కట్టుబడి చెల్లింపులు ఉంటాయని అంతర్గత వర్గాలు చెబుతున్నాయి. ఒప్పంద కాలం మొత్తం నిషేధం కొనసాగితే బీసీసీఐ పడే నికర ప్రభావం 2 శాతం కంటే తక్కువ అని బ్రాండ్ ఫైనాన్స్ ప్రతినిధి అజిమోన్ ఫ్రాన్సిస్ అంచనా వేశారు. అంటే బీసీసీఐ కంటే బంగ్లాదేశ్ వైపుకే ఎక్కువ నష్టం ఉంటుందని చెప్పారు.

# యాషెస్‌లో హీటెడ్ మూమెంట్..



యాషెస్ సిరీస్ ఐదో టెస్టులో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్, ఆస్ట్రేలియా బ్యాటర్ మార్నస్ లబుషేన్ మధ్య మాటల యుద్ధం చోటుచేసుకుంది. రెండో రోజు ఆట ముగింపు సమయంలో జరిగిన ఈ సంఘటనతో మైదానంలో ఉద్రిక్తత నెలకొంది. అయితే, తర్వాతి ఓవర్‌లోనే లబుషేన్ ఔట్ అవ్వడంతో స్టోక్స్ వికెట్‌తోనే సమాధానం చెప్పాడు. ఈ ఘటనపై వ్యాఖ్యాతలు, ఆటగాళ్లు స్పందించారు. ఒత్తిడితోనే ఇలాంటి సందర్భం వచ్చి ఉంటుంది అని గిల్‌క్రిస్ట్ అన్నాడు. యాషెస్ సిరీస్ ఐదో టెస్టులో సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ వేదికగా కొంత హీట్ మూమెంట్ నెలకొంది. ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ , ఆస్ట్రేలియా బ్యాటర్ మార్నస్ లబుషేన్ మధ్య మాటల యుద్ధం నడిచింది. అయితే చివరికి ఫీల్డ్‌లోనూ, ఫలితంలోనూ స్టోక్స్‌కే పైచేయి దక్కింది. రెండో రోజు ముగింపు సమయంలో ఈ సంఘటన చోటు చేసుకోవడంతో, గ్రౌండ్‌లో కాస్తంత టెన్షన్ వాతావరణం నెలకొంది. రెండో రోజు 29వ ఓవర్ చివరలో లబుషేన్ - స్టోక్స్ మధ్య చిన్న క్లాష్ నెలకొంది. ట్రావిస్ హెడ్ వరుసగా బౌండరీలు కొట్టడంతో స్టోక్స్ అసహనానికి గురయ్యాడు. అదే సమయంలో లబుషేన్‌తో మాటల తూటాలు మారాయి. వెలుతురు తగ్గడం అంశం కూడా ఈ వివాదానికి కారణమై ఉండొచ్చని తెలుస్తోంది. ఫీల్డింగ్ పొజిషన్‌కి వెళ్తూ స్టోక్స్ నోరు జారినట్లు స్టంప్ మైక్‌లో నమోదైంది. తర్వాత స్టోక్స్ తిరిగి లబుషేన్ వైపు నడుచుకుంటూ వెళ్లి, అతని భుజంపై చేయి వేశాడు. అంపైర్ అహ్సన్ రాజా వెంటనే అక్కడికి చేరి పరిస్థితిని శాంతింపజేశాడు. ఈ ఘటనపై వ్యాఖ్యాత ఆడమ్ గిల్‌క్రిస్ట్ స్పందిస్తూ “ఐదో టెస్ట్ కావడంతో అలసట, ఒత్తిడి కలిసి ఇలా జరిగి ఉండొచ్చు. పరిస్థితిని చల్లార్చే ప్రయత్నమా? లేక మరింత వేడి పెంచిందా? అన్నది అర్థం కాలేదు” అని వ్యాఖ్యానించాడు.కానీ అసలు ట్విస్ట్ మాత్రం తర్వాతి ఓవర్‌లో చోటుచేసుకుంది. స్టోక్స్ వేసిన ఓవర్‌లోనే లబుషేన్ డ్రైవ్‌కు ప్రయత్నించి, గల్లీలో జేకబ్ బేతెల్ చేతికి చిక్కాడు. 48 పరుగుల వద్ద లబుషేన్ ఔట్ కావడంతో, ఈ మాటల యుద్ధానికి స్టోక్స్ వికెట్‌తో సమాధానం చెప్పినట్టయింది. ఔట్ అయిన తర్వాత ఇద్దరి మధ్య ఇక ఎలాంటి మాటలు జరగలేదు.నైట్‌వాచ్‌మన్ మైఖేల్ నెసర్ మాత్రం ఈ ఉద్రిక్తతపై తనకు తెలియదని చెప్పాడు.

# దుమ్మురేపిన కరీంనగర్ కుర్రాడు..



విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ జట్టు పేలవ ప్రదర్శన చేస్తోంది. ఇప్పటికే ఐదు మ్యాచ్‌ల్లో నాలుగు ఓడిపోయింది. అయితే ఈ జట్టులో ఉన్న కరీంనగర్ యువకుడు అమన్ రావు మాత్రం అదరగొడుతున్నాడు. బెంగాల్‌తో జరుగుతున్న ఆరో మ్యాచ్‌లో అద్భుతమైన డబుల్ సెంచరీ సాధించాడు. తన మూడో లిస్ట్-ఏ మ్యాచ్‌లోనే.. 200 పరుగులు చేసి ఔరా అనిపించాడు. కాగా, హైదరాబాద్ జట్టు తరఫున ఈ ఘనత సాధించిన తొలి ఆటగాడిగా నిలిచాడు అమన్ రావు. విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ జట్టు పేలవ ప్రదర్శన చేస్తున్నా.. ఈ టీమ్ ప్లేయర్ అమన్ రావు మాత్రం అదరగొడుతున్నాడు. మంగళవారం (డిసెంబర్ 6) రాజ్‌కోట్ వేదికగా బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో.. కరీంనగర్ కుర్రాడు అమన్ రావ్ దుమ్మురేపాడు. బంగాల్ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ డబుల్ సెంచరీతో చెలరేగాడు. ఓపెనర్‌గా క్రీజులోకి దిగిన అమన్ రావు.. 154 బంతుల్లో 12 ఫోర్లు, 13 సిక్సలతో 200 పరుగులు చేసి నాటౌగ్‌గా నిలిచాడు. అమన్ రావుకు ఇది కేవలం మూడో లిస్ట్-ఏ మ్యాచ్ మాత్రమే. ఇంతకుముందు బరోడాతో (13), ఛండీగఢ్‌తో జరిగి మ్యాచ్‌లో (39) పరుగులు సాధించాడు. ఇప్పడు బెంగాల్‌తో జరిగి మ్యాచ్‌లో డబుల్ సెంచరీ బాదాడు. అయితే లిస్ట్-ఏ క్రికెట్‌లో తొలి సెంచరీనే.. డబుల్ సెంచరీగా మలిచాడు. కాగా, టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్.. నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 352 పరుగులు చేసింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన అమన్ రావు.. బెంగాల్ బౌలర్లు మహమ్మద్ షమీ, ముఖేష్ కుమార్, ఆకాష్ దీప్, షెహబాజ్ అహ్మద్ వంటి వారిని కూడా హడలెత్తించాడు. షమీ, ముఖేష్ కుమార్, ఆకాశ్ దీప్ బౌలింగ్‌లోనే.. అమన్ రావు 120 పరుగులు రాబట్టడం గమనార్హం. ఇక వీరి బౌలింగ్‌లో 8 సిక్సర్లు బాదాడు అమన్ రావు.129.87 స్ట్రైక్‌రేట్‌తో అద్భుత ప్రదర్శన చేసిన అమన్ రావు.. 108 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో 46 బంతుల్లోనే డబుల్ సెంచరీ బాదేశాడు. చివరి ఓవర్‌లో ఆఖరి బంతి వేసే ముందు 194 పరుగుల వద్ద ఉన్న అమన్.. ఆకాశ్ దీప్ బౌలింగ్‌లో సిక్స్ కొట్టి డబుల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఓపెనర్ గహ్లోత్ రాహుల్ సింగ్ (65) రాణించాడు. ఇక కెప్టెన్ తిలక్ వర్మ (34), ప్రజ్ఞయ్ రెడ్డి (22) ఫర్వాలేదనిపించారు. అభిరాత్ రెడ్డి (5), ప్రనవ్ వర్మ (7) తేలిపోయారు. కాగా, బెంగాల్ బౌలర్లలో మహ్మద్ షమీ మూడు వికెట్లు పడగొట్టాడు. షెగబాజ్ అహ్మద్, రోహిత్ దాస్ చెరే వికెట్ తీశారు.అమన్ రావు రికార్డులు..తన మూడో లిస్ట్-ఏ మ్యాచ్‌కే రికార్డులు బద్దలుకొట్టాడు అమన్ రావు. లిస్ట్-ఏ క్రికెట్‌లో ద్విశతకం పూర్తి చేసిన 15వ భారతీయ ప్లేయర్‌గా రికార్డు సృష్టించాడు. దీంతో అతి కొద్ది మంది ఉన్న ఈ జాబితాలో అమన్ రావు చేరాడు. అంతేకాకుండా ఈ లిస్ట్-ఏ ఫార్మాట్‌లో దరాబాద్ తరఫున డబుల్ సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గానూ నిలిచాడు. కాగా, ఇటీవల అబుదాబి వేదికగా జరిగిన ఐపీఎల్ 2026 మినీ వేలంలో రాజస్థాన్ రాయల్స్ అమన్ రావును రూ.30 లక్షలకు కొనుగోలు చేసింది. అమెరికాలో పుట్టిన అమన్ రావు హైదరాబాద్‌లో పెరిగాడు. కరీంనగర్ జిల్లాలో అతడి మూలాలు ఉన్నాయి. అమన్ గత కొద్దికాలంగా దేశవాళీ క్రికెట్‌లో మెరుస్తున్నాడు. కాగా, ఇప్పటివరకు 5 మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్.. నాలుగు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ప్రస్తుతం బెంగాల్‌తో ఆరో మ్యాచ్ ఆడుతోంది.




# ఏ ఆర్ రెహమాన్‌కి 'పెద్ది' టీమ్ విషెస్...




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న గ్రామీణ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'పై అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపింది. 'చికిరి చికిరి' పాటతో రెహమాన్ మ్యాజిక్ మొదలైందని, రాబోయే పాటలు ఇంకా అద్భుతంగా ఉంటాయని టీమ్ పేర్కొంది. ఇప్పటికే విడుదలైన ఈ సాంగ్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పుకార్లకు చెక్ పెడుతూ 'పెద్ది' సినిమాను 2026 మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, 'ఉప్పెన'తో దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న గ్రామీణ నేపథ్య స్పోర్ట్స్ రివేంజ్ డ్రామా 'పెద్ది' టాలీవుడ్‌లో ప్రస్తుతం అత్యంత హైప్ ఉన్న ప్రాజెక్ట్‌గా నిలుస్తోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ భాగస్వాములుగా ఉండటం సినిమాకు మరింత బలాన్ని చేకూర్చింది. రామ్ చరణ్ సరసన బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. మంగళవారం (జనవరి 6) ఏ.ఆర్. రెహమాన్ పుట్టినరోజు సందర్భంగా 'పెద్ది' సినిమా టీమ్ ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపింది. "'చికిరి చికిరి' పాట కేవలం ఆరంభం మాత్రమే రాబోయే పాటల్లో రెహమాన్ మ్యాజిక్ మరింత గట్టిగా వినిపించబోతోంది" అని పేర్కొన్నారు. సినిమాకు రెహమాన్ సంగీతం గొప్ప అదనపు బలమని, ఆయన మ్యూజిక్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుందని చిత్రబృందం విశ్వాసం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా 'పెద్ది' రిలీజ్ డేట్‌పై వినిపిస్తోన్న రూమర్లకు మేకర్స్ చెక్ పెట్టారు. రెహమాన్ పుట్టినరోజు సందర్భంగా చేసిన ట్వీట్‌లో ఈ మూవీని మార్చి 27న రిలీజ్ చేయబోతున్నట్లు మరోసారి ప్రకటించడంతో వాయిదా రూమర్లకు చెక్ పెట్టినట్లయింది. 'గేమ్ ఛేంజర్' వంటి డిజాస్టర్ తర్వాత రామ్ చరణ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో 'పెద్ది'పై భారీ అంచనాలున్నాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్స్‌తో పాటు 'చికిరి చికిరి' పాట ప్రేక్షకుల్ని విపరీతంగా ఆకట్టుకుంది. గ్రామీణ నేపథ్యానికి తగ్గ ఫోక్ టచ్, ఎనర్జిటిక్ రిథమ్, రామ్ చరణ్ మాస్ లుక్, బాడీ లాంగ్వేజ్ అన్నీ కలిసి ఈ పాటను చార్ట్‌బస్టర్‌గా మార్చాయి. సోషల్ మీడియాలో ఈ సాంగ్ రీల్స్, షార్ట్ వీడియోల రూపంలో వైరల్ అవుతూ 'పెద్ది'పై నమ్మకాన్ని మరింత బలపరిచింది. ఈ స్పందనతో సినిమా కంటెంట్ పరంగా కూడా బలంగా ఉండబోతోందన్న అభిప్రాయం ప్రేక్షకుల్లో వ్యక్తమవుతోంది. ఇక అభిమానులకు మరో శుభవార్త ఏమిటంటే, సంక్రాంతికి సెకండ్ సింగిల్ విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారన్న టాక్ గట్టిగా వినిపిస్తోంది. 'చికిరి చికిరి'తో మొదలైన రెహమాన్ మ్యాజిక్, రాబోయే పాటలతో ఇంకెన్ని స్థాయిలకు వెళ్తుందోనన్న ఆసక్తి ఫ్యాన్స్‌లో పెరుగుతోంది. మొత్తంగా, కథ, స్కేల్, ఎమోషన్, మ్యూజిక్ అన్నీ కలిసి 'పెద్ది'ను రామ్ చరణ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిపేలా చేస్తున్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# ప్రేక్షకులకి బిగ్ రిలీఫ్...




సంక్రాంతి రేసులో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌కు సంబంధించిన అప్‌డేట్స్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన వస్తోంది. తాజాగా ఈ సినిమా టికెట్ ధరలు పెంచకుండా, సాధారణ రేట్లకే విడుదల చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇది ప్రేక్షకులకు పెద్ద ఊరటగా మారింది. స్టార్ హీరో సినిమా అయినప్పటికీ ధరలు పెంచకపోవడం సరైన నిర్ణయమని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. సంక్రాంతి సీజన్ దగ్గరపడుతుండటంతో టాలీవుడ్‌లో సినిమాల సందడి మొదలైంది. ఈ పండుగ రేసులో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్టైనర్ ' మన శంకర వరప్రసాద్ గారు 'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సక్సెస్‌ఫుల్ దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌లో చిరంజీవి వింటేజ్ కామెడీ టైమింగ్, మాస్ మేనరిజమ్స్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో కనిపించనున్నాడన్న విషయం కూడా సినిమాపై హైప్‌ను మరింత పెంచింది. సంక్రాంతికి ఫ్యామిలీతో కలిసి చూసే పక్కా ఎంటర్టైనర్‌గా ఈ చిత్రం నిలుస్తుందనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ఇటీవల కాలంలో సినిమాల నిర్మాణ వ్యయాలు భారీగా పెరగడంతో, నిర్మాతలు తమ పెట్టుబడులు తిరిగి రాబట్టుకోవడానికి టికెట్ ధరలు పెంచుతున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా స్టార్ హీరోల సినిమాలు విడుదలయ్యే సమయంలో మొదటి వారం పాటు పెరిగిన టికెట్ రేట్లతో థియేటర్లలో ప్రదర్శించడం సాధారణంగా మారింది. ఈ కారణంగా ప్రేక్షకులపై ఆర్థిక భారం పెరుగుతోందన్న విమర్శలు గత కొన్నేళ్లుగా వినిపిస్తూనే ఉన్నాయి. సంక్రాంతి సీజన్ కావడంతో ఈసారి కూడా భారీ హీరోల సినిమాలకు టికెట్ ధరలు పెరుగుతాయనే అంచనాలు మొదట్లోనే నెలకొన్నాయి. అయితే 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా టికెట్ ధరల విషయంలో తాజాగా వినిపిస్తున్న వార్తలు ప్రేక్షకులకు ఊరటనిస్తున్నాయి.

# లంగావోణి కడితే ట్రోల్ చీర కడితే క్లాప్స్....





మెగా - అల్లు బ్యాగ్రౌండ్ తో ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చి, హీరోగా తనకంటూ ఓ బ్రాండ్ క్రియేట్ చేసున్నాడు అల్లు అర్జున్. 23 ఏళ్ల సినీ కెరీర్ లో స్టైలిష్ స్టార్ నుంచి ఐకాన్ స్టార్ గా ఎదిగారు. ఇప్పుడు పాన్ ఇండియా స్టార్ గా కొనియాడబడుతున్నారు. ఈ ప్రయాణంలోని భావోద్వేగ క్షణాలను నిర్మాత బన్నీ వాసు తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. 'గంగోత్రి' సినిమా రిలీజ్ రోజు జరిగిన సంఘటనను గుర్తు చేస్తూ.. అల్లు అర్జున్ అప్పుడు చాలా బాధ పడ్డాడని, ఇండియాలో బిగ్గెస్ట్ స్టార్ అవుతానని అన్నాడని బన్నీ వాసు తెలిపారు. అల్లు అర్జున్ గురించి ఇంకా ఆయన ఏం చెప్పారంటే... సినీ బ్యాగ్రౌండ్ తో ఇండస్ట్రీలో హీరోగా ఎంట్రీ ఇవ్వడం సులభమే కావచ్చు, కానీ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుని, పాన్ ఇండియా స్థాయిలో స్టార్‌డమ్ అందుకోవడం సామాన్యమైన విషయం కాదు. మెగా - అల్లు బ్రాండింగ్ తో పరిశ్రమలో అడుగుపెట్టిన అల్లు అర్జున్.. విమర్శలనే మెట్లుగా మార్చుకుని ఎదిగిన 'ఐకాన్ స్టార్'గా ఎదిగారు. 2003లో 'గంగోత్రి' సినిమాతో హీరోగా పరిచయమయ్యాడు బన్నీ. మొదటి సినిమా హిట్టయినా, ఆ సమయంలో అతను ఎదుర్కొన్న ట్రోలింగ్ అంతా ఇంతా కాదు. లుక్స్ విషయంలో, నటన విషయంలో తీవ్రమైన విమర్శలు వచ్చాయి. బ్యాగ్రౌండ్ ఉంటే ఎవరైనా హీరో అయిపోవచ్చు అనే కామెంట్స్ వినిపించాయి. అయితే రెండో చిత్రం నుంచే బన్నీ తనేంటో ప్రూవ్ చేసుకున్నారు.'ఆర్య' సినిమాతో అల్లు అర్జున్ తనలోని నటుడిని, డ్యాన్సర్ ని ప్రేక్షకులకు పరిచయం చేశారు. బాడీ లాంగ్వేజ్, మేనరిజమ్స్‌లో కొత్తదనాన్ని చూపిస్తూ కుర్రకారును ఆకట్టుకున్నారు. 'బన్నీ' చిత్రంతో స్టైలిష్ స్టార్ అనిపించుకున్నారు. అక్కడి నుంచి 'దేశముదురు', 'పరుగు', 'జులాయి', 'రేసుగుర్రం', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'సరైనోడు', 'డీజే దువ్వాడ జగన్నాథం', 'అల వైకుంఠపురంలో' సినిమాలతో తన మార్కెట్‌ను పెంచుకుంటూ పోయారు. సినిమా సినిమాకి తన రూపాన్ని, నటనను మెరుగుపరుచుకుంటూ 'అల్లు అర్జున్' అనే సొంత బ్రాండ్‌ను క్రియేట్ చేసుకున్నారు. సపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఏర్పరచుకున్నారు. 'పుష్ప: ది రైజ్' సినిమా అల్లు అర్జున్ కెరీర్‌ను మరో మలుపు తిప్పిందని చెప్పాలి. పుష్పరాజ్ గా ఆయన నటనకు పెర్ఫార్మెన్స్‌కు పాన్ ఇండియా ఫిదా అయింది. దీంతో ఉత్తమ నటుడిగా నేషనల్ అవార్డు అందుకున్న తొలి తెలుగు హీరోగా బన్నీ చరిత్ర సృష్టించారు. 'పుష్ప 2: ది రూల్' మూవీతో బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తూ, బిగ్గెస్ట్ పాన్ ఇండియా స్టార్‌గా అవతరించారు. అల్లు అర్జున్ 23 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంపై ఆయన ఫ్రెండ్, నిర్మాత బన్నీ వాసు ఇటీవల చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి."నేను చెబితే ఎవరూ నమ్మరు. లైఫ్ లో అల్లు అర్జున్ నుంచి ఇన్స్పైర్ అయిన ఇన్సిడెంట్ ఒకటి ఉంది. ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లో నేనూ బన్నీ కలిసి గంగోత్రి సినిమా చూస్తున్నాం. ఆయన క్యాప్ పెట్టుకొని ఉన్నాడు.. అప్పుడు ఎవరికీ పెద్దగా తెలియదు. ఇంటర్వెల్ లో క్యాంటీన్ దగ్గర నిలబడ్డాం. బయటకి వచ్చిన జనాలు హీరో లుక్స్ మీద నెగెటివ్ కామెంట్స్ చేస్తున్నారు. సినిమా బాగుందని అంటున్నప్పటికీ, హీరో మీద కామెంట్స్ పడుతూనే ఉన్నాయి. కారు ఎక్కి ఆయన సైలెంట్ గా కూర్చున్నారు. ఆయన బాధ పడుతున్నారని నాకు అర్థమైంది. సినిమా బాగున్నా, ఆ కామెంట్స్ ఆయన మనసుకి తగిలాయి అనేది తెలుస్తుంది. దాన్నుంచి ఆయన్ను బయటకి తీసుకురావడానికి, సినిమా చాలా బాగుంది.. కచ్చితంగా ఆడుతుంది అని అన్నాను. 'సినిమా బాగుంది.. కానీ నేను బాగాలేను' అని బన్నీ అన్నాడు. ఏం మాట్లాడాలో తెలియక నేను సైలెంట్ అయిపోయాను. ఇంటి దగ్గరకు వచ్చిన తర్వాత 'ఏదో ఒక రోజు నేను ఇండియాలో బిగ్గెస్ట్ స్టార్ ని అవుతా' అని నాతో చెప్పాడు""గంగోత్రి' సినిమా రిలీజ్ రోజున ఆయన ఆ మాట అన్నాడు. అది ఎక్కడ చెప్పాడు.. ఏ స్పాట్ లో చెప్పాడు అనేది ఇప్పటికీ నాకు గుర్తుంది. ఈయన మరీ ఎక్కువగా తీసుకుంటున్నాడని ఆరోజు మనసులో అనుకున్నాను. అక్కడి నుంచి ఆయన లైఫ్ అంతా సినిమాకి డెడికేట్ చేశాడు. కిందా మీదా పడ్డాడు.. ఒక తపస్సులా తీసుకున్నాడు. అన్నీ చూస్తూ వచ్చాను. 'పుష్ప' ఫస్ట్ పార్ట్ కంటే, పుష్ప-2 చూసిన తర్వాత నాకు అనిపించింది. చీర కట్టుకుని చేసే సీన్స్ చూసినప్పుడు నా మనసుకి తగిలింది. 'గంగోత్రి' సినిమాలో ఈయన లంగావోణి వేసుకున్నప్పుడు నెగెటివ్ కామెంట్లు పడ్డాయి. అదే అల్లు అర్జున్ 20 సంవత్సరాల తర్వాత చీర కట్టుకుని వస్తే, థియేటర్లలో క్లాప్స్ పడ్డాయి. ఇది కదా ఒక మనిషి జర్నీ అంటే అని నాకు అప్పుడు అనిపించింది. పుష్ప-2లో ఆ సీన్ వచ్చినప్పుడు నేను థియేటర్లో నిలబడి క్లాప్స్ కొట్టాను. నేను ఎందుకు క్లాప్స్ కొట్టాననేది నాకు ఒక్కడికే తెలుసు" అని బన్నీ వాసు తెలిపారు."థియేటర్ కి వెళ్లి ఆడియన్స్ ఏమనుకుంటున్నారో స్వయంగా విని తెలుసుకునే అలవాటు అల్లు అర్జున్ కి ఇప్పటికీ ఉంది. ఈరోజుకీ మాస్క్, క్యాప్ పెట్టుకొని సింగిల్ గా సినిమాకి వెళ్తుంటాడు. సినిమా అయిపోయిన తర్వాత జనాలతో పాటుగా నడుచుకుంటూ బయటకి వచ్చి, టాక్ ఏంటి అని తెలుసుకుంటూ ఉంటాడు. ఆడియన్స్ ఫీడ్ బ్యాక్ తీసుకుంటూ ఉంటారు" అని బన్నీ వాసు చెప్పారు. ఏదైనా సినిమా ఫ్లాప్ అయినప్పుడు అల్లు అర్జున్ బాధ పడతారని, చాలా సీరియస్ గా తీసుకుంటారని నిర్మాత తెలిపారు. ఒక నెల రోజుల పాటు ఆయన జోలికి వెళ్లకపోవడమే బెటర్ అన్నారు. పైకి చూడ్డానికి బాగానే ఉంటాడు కానీ.. లోపల మాత్రం చాలా డీప్ గా ఆలోచిస్తుంటాడు. ఎందుకు ఫెయిల్ అయిందనే విషయాలపై నోట్స్ ప్రిపేర్ చేసుకుంటాడు.. హోమ్ వర్క్ చాలా ఎక్కువ చేస్తాడని నిర్మాత బన్నీ వాసు చెప్పుకొచ్చారు.

# శరవేగంగా 'డ్రాగన్' షూటింగ్..



యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా యాక్షన్ డ్రామా 'డ్రాగన్' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కొన్ని నెలల విరామం తర్వాత ఈ సినిమా షూటింగ్ తాజాగా హైదరాబాద్ శివార్లలో తిరిగి ప్రారంభమైంది. ఎన్టీఆర్ సరసన రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రతిష్ఠాత్మకంగా మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. పుకార్లకు చెక్ పెడుతూ యూనిట్ మళ్లీ యాక్షన్‌లోకి రావడంతో అభిమానుల్లో జోష్ పెరిగింది. త్వరలో విదేశాల్లో కీలక షెడ్యూల్ కూడా ఉండనున్నట్లు సమాచారం. 'కేజీఎఫ్' సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతోన్న పీరియాడిక్ పాన్ ఇండియా యాక్షన్ డ్రామా ' డ్రాగన్ ' (వర్కింగ్ టైటిల్) ప్రస్తుతం టాలీవుడ్‌లో అత్యంత భారీ అంచనాలు ఉన్న ప్రాజెక్ట్‌గా నిలుస్తోంది. ఎన్టీఆర్ కెరీర్‌లోనే గుర్తుండిపోయే సినిమాగా ఈ చిత్రం నిలుస్తుందని మేకర్స్ ధీమాగా చెబుతున్నారు. ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తుండగా, ఎన్టీఆర్ ఆర్ట్స్ సమర్పిస్తోంది. హీరోయిన్‌గా రుక్మిణీ వసంత్ నటిస్తుండగా, సినిమాటోగ్రఫీ బాధ్యతలను భువన గౌడ నిర్వర్తిస్తున్నారు. ప్రశాంత్ నీల్ మార్క్ ఇంటెన్స్ యాక్షన్, ఎమోషనల్ డ్రామా ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలవనున్నాయి. ఈ సినిమా ప్రారంభమైనప్పటి నుంచి షూటింగ్ అప్‌డేట్స్ విషయంలో కొంత నిశ్శబ్దం నెలకొనడంతో అభిమానుల్లో అనేక సందేహాలు తలెత్తాయి. ఒక దశలో ప్రాజెక్ట్ మధ్యలో ఆగిపోయిందన్న ప్రచారం కూడా బలంగా వినిపించింది. దర్శకుడు ప్రశాంత్ నీల్ టేకింగ్‌పై ఎన్టీఆర్ అసంతృప్తిగా ఉన్నాడని, ఇద్దరి మధ్య విభేదాల వల్లే షూటింగ్ నిలిచిపోయిందని ఇండస్ట్రీ వర్గాల్లో జోరుగా వార్తలు చక్కర్లు కొట్టాయి. ఇదే సమయంలో ఎన్టీఆర్ మరో ప్రాజెక్ట్ 'దేవర 2'పై కూడా ఇలాంటి కథనాలు రావడంతో అభిమానులు మరింత ఆందోళనకు గురయ్యారు. అయితే ఆ పుకార్లన్నింటికీ చెక్ పెడుతూ, 'డ్రాగన్' యూనిట్ ఇటీవలే మళ్లీ షూటింగ్ ప్రారంభించింది. దాదాపు ఆరు నెలల విరామం తర్వాత రామోజీ ఫిల్మ్ సిటీలో కొత్త షెడ్యూల్‌ను మొదలుపెట్టిన చిత్ర బృందం కీలక యాక్షన్ ఘట్టాలను అక్కడ చిత్రీకరించింది. ఈ షెడ్యూల్‌లో ప్రధానంగా నైట్ షూట్స్, భారీ ఫైట్ సీక్వెన్స్‌లు తెరకెక్కించగా, ఎన్టీఆర్‌తో పాటు ప్రధాన తారాగణం మొత్తం పాల్గొంది. రుక్మిణీ వసంత్ కూడా ఈ షెడ్యూల్‌లో జాయిన్ కావడంతో షూటింగ్ వేగం పుంజుకుంది. రామోజీ ఫిల్మ్ సిటీలోని షెడ్యూల్ పూర్తైన అనంతరం ప్రస్తుతం హైదరాబాద్ శివార్లలోని ఓ ప్రైవేట్ స్టూడియోలో మరో కీలక యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నట్టు సమాచారం. ప్రశాంత్ నీల్ స్టైల్‌కు తగ్గట్టుగా ఈ ఫైట్స్‌ను చాలా రా అండ్ రియలిస్టిక్‌గా తెరకెక్కిస్తున్నారని టాక్. ఈ షెడ్యూల్ పూర్తయ్యాక విదేశాల్లో కీలక భాగాల షూటింగ్‌కు ప్లాన్ చేస్తున్నారట. అందుకోసమే ఇటీవల సినిమాటోగ్రాఫర్ భువన గౌడ జోర్డాన్ వెళ్లి అక్కడి లొకేషన్లను ఫైనలైజ్ చేసినట్లు వార్తలు వచ్చాయి. ఇక కథ విషయానికి వస్తే, 1969 కాలంలో చైనా, భూటాన్, భారతదేశ సరిహద్దు ప్రాంతాల నేపథ్యంలో ఈ కథ సాగుతుందని తెలుస్తోంది. దేశభక్తి, రాజకీయ ఉద్రిక్తతలతో పాటు తల్లి సెంటిమెంట్ ఈ చిత్రంలో కీలకంగా ఉంటుందట.

# జననాయగన్ ఎం పరాశక్తి..




తమిళనాడులో ఈసారి పొంగల్‌కు సినిమాలు మాత్రమే కాకుండా.. రాజకీయాలు కూడా బాగా హాట్ హాట్‌గా మారనున్నాయి. రాజకీయాల్లోకి వచ్చిన విజయ్ నటిస్తున్న జననాయగన్ సినిమాకు పోటీగా.. డీఎంకేతో సంబంధం ఉన్న పరాశక్తి సినిమాలు.. ఇప్పుడు పొంగల్ బరిలో నిలిచాయి. అయితే ఈ రెండు సినిమాలకు సక్సెస్, కలెక్షన్ల గురించి మాత్రమే కాకుండా.. ఈ ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముడిపడి ఉండటంతో.. సినీ ప్రేక్షకులకు మాత్రమే కాకుండా.. రాజకీయ వర్గాలు, కార్యకర్తలు, తమిళ ప్రజలందరికీ ఇప్పుడు అంతా ఈ రెండు సినిమాలపైనే ఫోకస్ పెట్టారు. తమిళనాడులో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ఈ ఎన్నికల కోసం ఆ రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలతోపాటు.. కాంగ్రెస్, బీజేపీ వంటి జాతీయ పార్టీలు కూడా బాగా దృష్టి పెట్టాయి. అధికారంలో ఉన్న ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే పార్టీని గద్దె దించాలని అటు బీజేపీ, ఇటు కొత్తగా విజయ్ పెట్టిన తమిళగ వెట్రి కళగం పార్టీ వ్యూహ ప్రతివ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే తమిళనాడు ఎన్నికల్లో హోరాహోరీ పోరు తప్పదనే సంకేతాలు వెలువడుతున్నాయి. అయితే అంతకంటే ముందు.. ఈసారి పొంగల్ (సంక్రాంతి) పండగకు తమిళ సినిమాల జోరు కొనసాగనుంది. అయితే ఈ పొంగల్ సినిమాలు కేవలం సినిమాలకు మాత్రమే పరిమితం కాకుండా.. రాజకీయాల్లో కీలక మలుపు తెచ్చే అవకాశాలు ఉన్నాయనే చర్చ ఇప్పుడు విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.విజయ్-జన నాయగన్‌దీంతో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల యుద్ధం ఈ పొంగల్‌కు బాక్సాఫీస్ వద్దే మొదలవుతోందని రాజకీయ, సినీ వర్గాలు చెబుతున్నాయి. టీవీకే పార్టీని పెట్టి రాజకీయ అరంగేట్రం చేసిన దళపతి విజయ్.. ఈసారి ఒంటరిగానే ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుతం విడుదలకు సిద్ధంగా ఉన్న జన నాయగన్ చిత్రం.. తన కెరీర్‌లో 69వది కాగా.. ఇదే చివరిది అని ఇప్పటికే ప్రకటించారు. ఈ సినిమా ఈనెల 9వ తేదీన థియేటర్లలోకి రానుంది. అవినీతి వ్యవస్థపై పోరాడే ఒక సామాన్య యువకుడి కథగా ఈ సినిమాను రూపొందించారు. 'నేను వస్తున్నాను.. వెనక్కి తగ్గేది లేదు' అనే డైలాగులు నేరుగా రాజకీయ ప్రత్యర్థులను ఉద్దేశించినవే అని అభిమానులు భావిస్తున్నారు. ఈ జన నాయగన్ సినిమాకు హెచ్. వినోద్ దర్శకత్వం వహిస్తుండగా.. అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. శివకార్తికేయన్-పరాశక్తిఅయితే డీఎంకే నేపథ్యం కలిగి ఉన్న పరాశక్తి సినిమా ఈనెల 10వ తేదీన విడుదల కానుంది. పరాశక్తి సినిమాలో శివకార్తికేయన్ హీరోగా నటిస్తున్నారు. డీఎంకే స్టాలిన్ తండ్రి, తమిళనాడు మాజీ సీఎం కరుణానిధి కుటుంబానికి చెందిన ఆకాష్ భాస్కరన్ ఈ పరాశక్తి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 1952లో కరుణానిధి రాసిన క్లాసిక్ చిత్రం పరాశక్తి పేరునే ఈ సినిమాకు పెట్టడం గమనార్హం. 1960లలో జరిగిన హిందీ వ్యతిరేక ఉద్యమం నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. హిందీ రుద్దుడు అంశాన్ని ప్రధానంగా తీసుకుని డీఎంకే సిద్ధాంతాలను ప్రతిబింబించేలా ఈ సినిమాను రూపొందించారు. శివకార్తికేయన్, అథర్వ మురళి ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా.. సుధా కొంగర డైరెక్టర్.అయితే.. రాజకీయ సందేశంతో జన నాయగన్ సినిమాను తెరకెక్కించగా..

Owned by Katikala Vara Prasad,Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Banka Indira . at D.no. 465 Le out no2. Dodleru Road. Ysr jagananna colony. Krosuru.Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/2015/62250. Ph:9849707349 email:kvp6858@gmail.com